

ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత



కరపత్రాలు పంచుతున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని జనసేన పార్టీ రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి అన్నారు. మంగళవారం జనం కోసం జనసేన పల్లెబాట కార్యక్రమంలో భాగంగా రూరల్ మండలంలోని కట్టుబావి, గొల్లపల్లిలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్రానికి మంచి రోజులు రావాలంటే జనసేన-టిడిపి కూటమి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రజలు ఈ కూటమికి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం, జిల్లా జాయింట్ సెక్రటరీ గజ్జల రెడ్డెప్ప, టౌన్ ప్రెసిడెంట్ నాయని జగదీష్ పాల్గొన్నారు.

- దోచుకునేందుకు ప్రభుత్వ కుట్ర
- నిజమైన అర్హులకు అందేనా?

పెద్దల చేతుల్లో అసైన్డ్ భూములు



పేదలను, దళితులను ఉద్ధరిస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం దశాబ్దాల తరబడి వారు సాగుచేసుకుంటున్న అసైన్డ్ భూములను దోచుకునేందుకు కుట్రలకు తెరలేపింది. గత ప్రభుత్వాలు అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను ఇప్పటికే ఎత్తేసిన ప్రభుత్వం అక్కడక్కడా పేదలు, దళితుల చేతుల్లో ఉన్న కొద్దిపాటి అసైన్డ్ భూములపైనా కన్నేసింది.

ప్రజాశక్తి - చాపాడు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 9/22 ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. ఈ ఆర్డినెన్స్ ద్వారా 20 సంవత్సరాలుగా అసైన్డ్ భూములను సాగు చేస్తున్న వాస్తవ లబ్ధిదారులకు, వారసులకు ఆ భూమిపై పూర్తి హక్కు కల్పిస్తామని చెప్పింది. లబ్ధిదారుల జాబితాను గ్రామ సచివాయాల్లో గ్రామాల వారీగా ప్రకటిస్తామని వెల్లడించింది. అసైన్డ్ భూముల వివరాలు, వాస్తవ లబ్ధిదారులు, ప్రస్తుతం ఎవరి సాగులో ఉంది అనే వివరాలను వెల్లడించి పాదర్శకత పాటిస్తామని ప్రకటనలు చేసింది. అయితే ఆచరణలో పూర్తి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజా పోరాటాల నేపథ్యంలో దళితులు, గిరిజనులకు పాలక ప్రభుత్వాలు అసైన్డ్ భూములు కేటాయించిన విషయం విధితమే. ఈ భూములు క్రయ, విక్రయాలకు అనుమతి లేకుండా 9/77 చట్టం గత కొన్ని దశాబ్ధాలుగా రక్షణగా ఉంది. గ్రామాల్లో సాగుకోసం భూముల పత్రాలను పెద్ద రైతులు, వ్యాపారుల తనఖాకు పెట్టుకుని సాగుదారులకు అప్పులు ఇచ్చారు. ఆ అప్పులు తీర్చలేక అత్యధిక మంది భూమికి దూరం అయినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఆ భూములు పూర్తిగా తమ సొంతం చేసుకునేందుకు పెద్దలు పావులు కదుపుతున్నారు.

అత్యధిక భూములు పెద్దల చేతుల్లోనే..

జిల్లాలో గ్రామాల వారీగా భూముల లభ్యతను బట్టి 20 సెంట్ల నుంచి 2.50 ఎకరాల వరకూ పేదలకు అసైన్డ్ భూములను గత ప్రభుత్వాలు అందజేశాయి. 2003కి పూర్వం పంపిణీ చేసిన భూములు ప్రస్తుతం గ్రామాల్లో పెద్ద రైతులు, అగ్రకులాలు, వ్యాపారుల చేతుల్లో ఉన్నట్లు అనేక ఉదాహం ణలున్నాయి. గ్రామాల్లో అసైన్డ్ భూమి లబ్ధిదారులు తమ భూములకు పూర్తిగా దూరమయ్యారు. ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీతో జిల్లావ్యాప్తంగా ఇటీవల సర్వే ప్రక్రియ ప్రారంభమైంది. ప్రభుత్వ, అసైన్డ్, భూధాన్ తదితర భూముల జాబితా విభజన జరిగింది. ఈ జాబితాను అధికారులు వెల్లడించకపోవటం పలు అనుమానాలకు తావిస్తోంది.

అమలుకు నోచని చట్ట సవరణ..

సబ్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా అసైన్డ్ భూముల చట్టాన్ని సవరించాలని ఎపి ప్రభుత్వం తీర్మానించి చట్ట సవరణ కోసం ఆర్డినెన్స్ జారీ చేసింది. ఇవే కాకుండా పేదలకిచ్చిన ఇళ్ల పట్టాలకు సైతం ఇది వర్తిస్తుందని సవరణ చట్టంలో స్పష్టం చేసింది. కేటాయించి పదేళ్లు దాటితే ఆయా ఇళ్ల స్థలాలపై లబ్ధిదారులకు యాజమాన్య హక్కులు లభిస్తాయి. వ్యవసాయ భూములైతే కేటాయించిన 20 ఏళ్లకు, ఇళ్ల స్థలాలైతే కేటాయించి పదేళ్లు పూర్తయిన వెంటనే వాటిపై సంబంధిత రైతులు, పేదలు, వారి వారసులకు యాజమాన్య హక్కులు లభిస్తాయని ఇందులో పేర్కొంది. ఈ ఆర్డినెన్స్‌పై గవర్నర్ కూడా సంతకం చేశారు. దీంతో అసైన్డ్ భూయజమానులకు వారి భూములపై సర్వ హక్కులు దక్కుతాయి. ఉమ్మడి జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా అసైన్డ్ భూమి ఉన్నట్లు అంచనా.



ఒంటిమిట్ట రెవెన్యూ పొలంలో సర్వే నంబర్ 2050లో పేదలు ఏడేళ్ల నుంచి సాగు చేసుకుంటున్నారు. పెండ్లిమర్రి మండలం పెద్దశెట్టిపల్లె రెవెన్యూపొలం సర్వే నంబర్ 330లో యల్లటూరు , పెండ్లిమర్రి ప్రాంతాల ఎస్‌సి, ఎస్‌టిలు రూ. 4లక్షలు ఖర్చుచేసి భూములను సాగులోకి తెచ్చుకున్నారు. అటువంటి భూములకు పట్టాలు మంజూరు చేయటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కాశినాయన మండల పరిధిలోని గ్రామాలకు చెందిన అసైన్డ్ భూములను విజయవాడ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు మొదలగు ప్రాంతాలకు చెందిన భూస్వాములు వందలాది ఎకరాలు అక్రమంగా అనుభవిస్తున్నారు. బ్రహ్మంగారిమఠం మండలం గొడ్లవీడులో ఒకే కుటుంబానికి చెందిన 11 మందికి 15.50 ఎకరాలిచ్చేందుకు వీలుగా జాబితాలో చోటిచ్చారు. రేకలకుంటలో మత్స్యకారుల ఆధార్ కార్డులను సేకరించి, వారి పేరుతో స్థానిక నేతలు పట్టాలు సిద్ధం చేయించారు. భూములను కేటాయించిన తర్వాత స్థానిక నేతలు తమ అధీనంలో ఉంచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. మరి ఈ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని తిరిగి ఆ పేదలకు ఇచ్చి యాజమాన్యపు హక్కులు కల్పిస్తుందా? బినామీ పేర్లతో అనుభవిస్తున్న ఆ భూస్వాములకే కట్టబెడతారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు..

సాగులో ఉన్న పేదల భూములకు పట్టాలు ఇవ్వాలని జిల్లా భూపోరాట సాదన కమిటీ డిమాండ్ చేస్తూ పోరాటాలు సాగిస్తున్నది. జిల్లాలో ఒంటిమిట్ట, పెండ్లిమర్రి, బద్వేల్, అట్లూరు, కోడూరు, కలసపాడు, బిమఠం, వీరపునాయని పల్లె, తదితర మండలంలోని దళితులు పేదలు సాగులో ఉన్నటు వంటిభూములకు అసైన్డ్ మెంట్ కమిటీలో పట్టాలు మంజురుచేయాలని పోరాటం సాగిస్తున్నారు. అందులో భాగంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌డిఓ కార్యాలయాల ముందు భూములు సాగులో ఉన్నలబ్ధిదారులతో కలిసిధర్నాలు నిర్వహించారు. స్థానిక పేదలకు సెంటు భూమి అసైన్డ్ మెంట్ కమిటీలో ఇవ్వలేదని స్థానిక ఎమ్మెల్యేల అనుచరులకు, అనర్హులకు ప్రభుత్వ భూములను అప్పజెప్పారని ఆరోపించారు. ఇప్పటికే అన్యాక్రాంతం అయిన భూములను స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులకు అనేకదపాలుగా ఆందోళనరూపంలో వినతిపత్రాలు ఇచ్చిన అధికారులు వాటిని విస్మరించారు. ఎళ్లతరబడి పేదలు సాగులో ఉన్నప్పటికీ అసైన్‌మెంట్‌లో పట్టాలు మంజురుచేయటం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం అసైన్డ్ మెంట్ కమిటీలో స్థానిక దళితులు, పేదలకు పట్టాలు మంజురుచేయాలని కోరుతున్నారు.

మైనర్లకు వాహనాలిస్తే శిక్షార్హులే



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న కడప జిల్లా ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్

ప్రజాశక్తి - కడప అర్బన్

రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా ఎస్.పి సిద్దార్థ్ కౌశల్ వినూత్న సందేశాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు వారికి పెద్ద ఎత్తున కౌన్సెలింగ్ చేపట్టారు. తల్లిదండ్రులు నిబంధనలకు విరుద్ధంగా మైనర్ పిల్లలకు వాహనాలు ఇచ్చి వారి అంద మైన భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టవద్దని, అజాగ్రత్త, నిర్లక్ష్యంతో పిల్లలకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని ఎస్‌పి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఇటీవల నగరంలో ఎస్‌పి పర్యవేక్షణలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో పట్టుబడ్డ 1004 వాహనాలను కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించి గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. పట్టుబడ్డ వాహనాల్లో బుల్లెట్ వాహనంపై పర్యటిస్తూ స్వయంగా తనిఖీల్లో పాల్గొని 296 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ మాట్లాడుతూ మరోసారి పట్టుబడితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి వాహనాలను కోర్టులో అప్పజెప్పి సీజ్ చేయిస్తామని హెచ్చరించారు. అజాగ్రత్త, నిర్లక్ష్యం వద్దని సూచించారు. తెలిసి తెలియని వయసులోని పిల్లలకు వాహనాలు ఇవ్వడం ద్వారా మీ పిల్లల ప్రాణాలతో పాటు రోడ్డుపై వెళ్లే అమాయకులైన ఎదుటి వారికి ప్రాణాపాయం జరుగుతుందని గుర్తుంచుకోవాలని తెలిపారు. అర్ధరాత్రి పూట అనవసరంగా రోడ్లపై తిరుగుతూ పోలీసులకు పట్టుబడ్డ ఆకతాయిలకు ఎస్‌పి కౌన్సెలింగ్ ఇచ్చారు. అదనపు ఎస్‌పి తుషార్ డూడి మాట్లాడుతూ ప్రజలు పోలీస్ సేవలను గుర్తించలేని పరిస్థితిలో ఉంటారని, వాహన తనిఖీల్లో ఎవరైనా సిబ్బంది వాహనాన్ని ఆపినప4డు ఎదురు ప్రశ్నిస్తారని, కానీ వారిని ప్రమాదాల బారిన పడకుండా సురక్షితం చేయడమే పోలీసుల ఉద్దేశమని తెలిపారు. మంచి కార్యక్రమాన్ని ఎస్‌పి నిర్వహించడాన్ని అందరూ స్వాగతిస్తున్నారని, ఇది శుభ పరిణామమని చెప్పారు. కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి కృష్ణారావు, కడప డిఎస్‌పి ఎం.డి షరీఫ్, ఎఆర్ డిఎస్‌పి బి.రమణయ్య, నగరంలోని సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పెద్దదర్గాను దర్శించుకున్న ముస్లిం ఐక్యవేదిక సభ్యులు



దర్గాని సందర్శించిన ఐక్యవేదిక నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అమీన్‌పీర్(పెద్ద దర్గా)ను ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా పెద్ద దర్గాలో ప్రార్ధన చేసి దర్గా విశిష్టతలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్, జియావుల్ రెహామాన్ మాట్లాడుతూ రాష్ట్ర పర్యటనలో భాగంగా కడపలో ముస్లిం ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహించామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్యక్రమాలు అనుసరించాల్సిన వ్యవహారాలపై చర్చించినట్టు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలపై ఒత్తిడి పెంచి ముస్లిములు అత్యధిక శాతం సీట్లు వచ్చేలా రాజ్యాధికారం దిశగా హక్కుల కోసం పోరాటాలు కొనసాగిస్తామని చెప్పారు. రానున్న కాలంలో ముస్లింల హక్కుల కోసం పోరాటాలను ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాఫర్, సయ్యద్ ఖలీల్, నూర్, సలావుద్దీన్, కలాం, జాబిద్, నాయకులు పాల్గొన్నారు.

డిసెంబర్ 4న చలో ఢిల్లీ : వ్య.కా.స

ప్రజాశక్తి-పెండ్లిమర్రి : రాష్ట్రంలో సామాజిక హక్కులు, ఆర్థిక భూమి సమ స్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 4న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన క్యాదర్శి అన్వేష్ పేర్కొన్నారు. మంగళవారం పెండ్లిమర్రి దళితవాడలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారత దేశంలో నేటికీ దళితులపై దాడులు, అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. మణిపూర్‌లో మనువాదుల చేతుల్లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేయడం యావత్ భారత దేశాన్ని తలదించుకునేలా చేసిందని వాపోయారు. దళితుల హక్కులను పాలక పక్షాలు హరించి వేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయకుండా దళితులకు ద్రోహం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మల్లేషు, ఉత్తయ్య, పగడాలయ్యా, ఓబులేసు ఈశ్వరయ్య, బాల గంగయ్య, లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు



విజేత జట్టుకు నగదును అందిస్తున్న మేడా కృష్ణతేజరెడ్డి

కబడ్డీ విజేత నాగిరెడ్డిపల్లె జూనియర్స్

ప్రజాశక్తి - నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సినీహిరో ప్రభాస్ జన్మదిన వేడుకలు సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో నాగిరెడ్డిపల్లె జూనియర్స్ జట్టు విజేతగా నిలిచింది. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే మేడా వెంకట మల్లి కార్జున్‌రెడ్డి కుమారుడు మేడా కృష్ణతేజరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రథమ బహుమతి రూ.10వేలు, నాగిరెడ్డిపల్లె జూనియర్స్ జట్టుకు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు, లేబాక జట్టుకు, తృతీయ బహుమతి రూ.3వేలు నాగిరెడ్డిపల్లె సీనియర్స్ జట్టుకు అందించారు. మొదటి బహుమతిని జనాబ్ ఎస్టీకాన్ చారిటబుల్ ట్రస్ట్, ద్వితీయ బహుమతి లక్ష్మీనారాయణ, తృతీయ బహుమతి సోమేశుల హరికృష్ణలు వితరణ చేశారు. పోటీలను ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్‌జహీర్ ప్రారంభించారు. కార్యక్రమంలోజిల్లా వక్ఫ్ బోర్డు ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, రాజంపేట రూరల్ జెసిఎస్ కన్వీనర్ వెలగచర్ల గంగిరెడ్డి, ఎజిపి షమీముల్లా ఖాన్, న్యాయవాది షేక్ మహమ్మద్‌అలీ, పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి

- డాక్టర్ హసీనా వెల్లడి

ప్రజాశక్తి-బి.కొత్తకోట



మాట్లాడుతున్న డాక్టర్ హసీనా

గర్భిణులు పోషకాహారం బాగా తీసుకున్నప్పుడే పుట్టబోయే బిడ్డలకు సురక్షి తమని డాక్టర్ హసీనా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో చాలా మంది గర్భిణులు గర్భం దాల్చినప్పుడు నిర్ధారణకు వచ్చినప్పుడు మేము జాగ్రత్తలు చెప్పి రక్త పరీక్షలు చేసి, రక్తం వృద్ధి చెందాలంటే పోషక ఆహారం తీసుకొని ఐరన్ టాబ్లెట్లు వాడాలని సూచిస్తు న్నామని చెప్పారు. గర్భిణులకు ప్రతినెలా పరీక్షలు చేయించు కోవాలని సూచించి నప్పటికీ మండలంలో చాలామంది ప్రతి నెల పరీక్షలు చేయించుకోకపోవడం వల్ల వారి బిడ్డ ఎదుగుదల సరిగ్గా లేకపోవడం, తల్లికి రక్తం తక్కువ ఉండడం వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. కాన్పు సమయంలో వచ్చినవారు ఎప్పుడో గర్భం దాల్చినప్పుడు వస్తారు కానీ మళ్ళీ పరీక్షలకు రాకపోవడం డెలివరీ టైంలో సమస్యలను గుర్తించడం జరుగు తుందన్నారు. గర్భిణులు నెలవారి పరీక్షలు చేసుకొని బిడ్డలు ఎదుగుదలను పరీక్షిస్తూ తగుజాగ్రత్తలు తీసుకొని సాధారణ కాన్పులకు సహకరించాలని డాక్టర్ హసీనా తెలిపారు. అలా కాకుంటే తప్పనిసరి పరిస్థితుల్లో సిజేరియన్లు చేయవ లసి వస్తుందని అన్నారు. గతంలో పిహెచ్‌సిలో ఉన్నప్పుడు సాధారణ కాన్పుల విషయంలో మొదటి స్థానంలో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి నెల వైద్యప రీక్షలు చేయించుకొని తగుజాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వాలన్నారు. తప్పనిసరి స్థితిలో మాత్రమే సిజెరిన్ చేయక తప్పదన్నారు.

సైకో పాలనకు ముగింపు పలుకుదాం: టిడిపి



కలికిరి : సైకో పోవాలి కరపత్రాలను దహనం చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కలికిరి

సైకో పాలనకు ముగింపు పలుకుదామని టిడిపి మండల అధ్యక్షుడు నిజాముద్దీన్ అన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు కలికిరి టిడిపి కార్యాలయం అమ ర్నాథ్‌రెడ్డి భవనంలో మండల అధ్యక్షుడు నిజాముద్దీన్ ఆధ్వర్యంలో నాయ కులు కార్యకర్తలు సైకో పోవాలి సైకిల్‌రావాలి అంటూ నినా దాలు చేస్తూ సైకో పోవాలి కరపత్రాలను మంట ల్లో కాల్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసి రాజకీయ కక్ష సాధింపులో భాగంగా మాజీ ముఖ్యమంత్రి చంద్ర బాబును అక్రమంగా అరెస్టు చేసి రాక్షస ఆనందం పొందుతున్నాడని విమర్శించారు. కార్యక్ర మంలో మండల ఉపాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, కలికిరి మేజర్ పంచాయతీ సర్పంచ్ రెడ్డివారి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి మాలతి, మాజీ సర్పంచ్ అంజమ్మ, మాజీ ఎంపిటిసి జనార్దన్ గౌడ్ పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** రాష్ట్రాన్ని నాశనం పట్టిస్తున్న సైకో జగన్ పోవాలని అక్రమంగా అరెస్టు చేయబడిన చంద్రబాబు నాయుడు బయటకు రావాలని మాజీ మార్కెట్ చైర్మన్ కాలాడీ ప్రభాకర్ రెడ్డి టిడిపి నాయకుడు ఆర్.నాగేంద్రరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రవిశంకర్‌రెడ్డి, రెడ్డప్పరెడ్డి, అజంతుల్లా ఇస్మాయిల్, అమీర్, వాసు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** వైసిపి పాలనతో ప్రజలు అష్టకష్టాలు పడుతు న్నారని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నాయకులు షాజహాన్ బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి బెంగళూరు బస్టాండులోని టిడిపి కార్యాలయం ఎదుట పార్టీ నాయకులతో కలిసి సైకో పోవాలి కరపత్రాలను దహనం చేసి,ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో జునైద్‌అక్బరీ, నాగూర్‌వలి, షంషీర్ నాదెండ్ల విద్యాసాగర్, బాలుస్వామి, గిరీష్ కుమార్, బాలమాలిశేఖర్, నాగమణి, హసీనా టిడిపి నాయకులు పాల్గొన్నారు. **ములకలచెరువు :** రాష్ట్రంలో వైసిపి పాలనకు రోజులు దగ్గరపడ్డాయని మండల టిడిపి అధ్యక్షులు పాలగిరి సిద్ధ పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు సైకో పాలన పోవాలి జగనాసుర కరపత్రాలను దహనం చేశారు. చంద్రబాబు ఆరోగ్యంగా ఉండి త్వరగా బెయిల్‌పై బయటకు వస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నాయకులు, శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ నాయకులు రామానుజులు, కేవీ. రమణ, చెన్నకృష్ణ చింతకుంట్ల కేశవ, మౌల, వెంకటస్వామి, కాల మహేష్, విజయ్ కుమార్, గాండ్ల రెడ్డెప్ప చాంద్ బాషా, బుర్రరమణ, శంకర్నా రాయణ, నారాయణస్వామి నాయుడు, సుబ్బు నాయుడు, రమణారెడ్డి, శామీర్, రవి, శ్రీనివాసులు, శ్రీనివాసులు, నాగేంద్ర, మధు, ఉమాశంకర్, నారాయణ, ప్రతాప్, ఆది, బసవి శ్రీనివాసులు, బసవి చంద్ర, తంబళ్ల శివన్న, విజయ్ కుమార్, రెడ్డప్ప, చెన్నకేశవులు పాల్గొన్నారు.

గిరిజన సేవా సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక



సమావేశానికి హాజరైన ప్రతినిధులు

ప్రజాశక్తి-పీలేరు

ఎపి గిరిజన సేవా సంఘం రాష్ట్ర కమిటీని జిల్లాలోని కెవి.పల్లి మండలం కంబిరెడ్డిగారిపల్లి ఎస్‌టి కాలనీలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీవెన్నెల కంటి రాఘవయ్య గిరిజన యానాది ఆశయ సాధన సమితి అనుబంధ సంస్థ, ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ ఈగ శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిర్వహించిన సమావేశంలో 30 మంది సభ్యులతో నూతన రాష్ట్ర కమిటీ ఏర్పాటు చేశారు. రాష్ట్ర అధ్యక్షులుగా పులి శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షులు, మీడియా సమన్వయకర్తగా జానం గంగిరెడ్డి, సలహాదారులుగా తుపాకుల హరిప్రసాద్, చౌటూరి కృష్ణమూర్తి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా గడ్డం శ్రీనివాసులు, కన్వీనర్‌గా మద్దాలి ఇశ్రాయేలు, యూత్ అధ్యక్షులుగా చుక్కలపాటి ఆదినారాయణ, ముఖ్య కార్యదర్శిగా ఏలూరి శ్రీనివాసులు, కోశాధికారిగా టేకుమంద రెడ్డప్ప, ఉపాధ్యక్షులుగా కంబాల ఈశ్వరయ్య, రాష్ట్ర మహిళా అధ్యక్షులుగా చేవూరి పద్మ, మహిళా కార్యనిర్వాహక అధ్యక్షులుగా బాదురి సావిత్రమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ ఈగ శ్రీనివాసరావు ఆశయ సాధన కోసం కృషి చేస్తూ, గిరిజన యానాదులను ఏక త్రాటిపై తెస్తూ గిరిజన యానాదుల అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు. త్వరలో గ్రామ స్థాయి నుండి సంఘం బలోపేతం చేసి జిల్లా కమిటీలు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి గిరిజన యానాది నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ జీనత్

నాదేశం-నామట్టి కలశ యాత్ర

ప్రజాశక్తి-పీలేరు : నెహ్రూ యువ కేంద్రం సూచనల మేరకు మంగళవారం పీలేరు పంచాయతీ కార్యాలయంలో నాదేశం నామట్టి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని షీ సంస్థ నిర్వాహకులు డాక్టర్ పివిఎస్ లక్ష్మి, న్యాయ సలహాదారులు డాక్టర్ రాయల సుధాకర్ తెలిపారు. పీలేరు పంచాయతీ సర్పంచ్ జీనత్‌షఫీ దంపతులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దేశభక్తిని చాటే కార్యక్రమాలను ప్రోత్సహిస్తామని తెలియజేశారు. పీలేరు ప్రజలు, కలికిరి ఇండో టిబెటన్ బెటాలియన్ వై.వీరారెడ్డి, సిబ్బంది అందరితో కలిసి ర్యాలీ నిర్వహించారు. బిజెపి పీలేరు అధ్యక్షులు రమణ, సీనియర్ అడ్వకేట్ చంద్రశేఖర్ రెడ్డి, బిజెపి సభ్యుల పాల్గొని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పురవీధుల్లో ఊరేగింపు కొనసాగించారు. నటరాజ కళామందిరం శిక్షకులు హరిత, విద్యార్థులు భరతమాత, తెలుగు తల్లి వేష భూషణలో అందరినీ అలరించారు. దేశభక్తిని చాటుతూ జాతీయ జెండాలతో ర్యాలీలో పాల్గొన్నారు. డాక్టర్ పివిఎస్ లక్ష్మి మాట్లాడుతూ నెహ్రూ యువ కేంద్రం ఈ కార్యక్రమాన్ని షీ సంస్థకు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇక్కడ సేకరించిన ఈ మట్టి కలశాలను 27వ తేదీన ఢిల్లీకి తీసుకు వెళ్లడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మీసేవ నిర్వాహకులు జ్ఞానంగారి శ్రీధర్, పంచాయతీ కార్మికులు, షఫీ షామియానా జావీద్ పాల్గొన్నారు.

ఆదర్శంగా ఎన్‌జిఒ కాలనీ అభివృద్ధి

ప్రజాశక్తి - రాయచోటి : ఆదర్శంగా ఎన్‌జిఒ కాలనీ అభివృద్ధి జరుగుతోందని కౌన్సిలర్, వైఎస్‌ఆర్ సిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. మదనమోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎన్‌జిఒ కాలనీలోని దేవలం వెనుకవీధిలో రూ. 15 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎస్‌డిహెచ్‌ఆర్ విద్యాసంస్థల అధినేత హరినాధ రెడ్డితో కలసి మదన మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి కృషితో గ్రేడ్ 1 మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు. 20వ వార్డులోని ఎన్‌జిఒ కాలనీలో చైతన్య స్కూల్ దగ్గర ఇటీవల రూ.35 లక్షలతో సిసి రోడ్డును నిర్మించామని, గతంలో రూ.5 లక్షలతో డ్రెయినేజీని కూడా నిర్మించామని చెప్పారు. మసీదు వీధినుంచి కొత్తపేట రామాపురం రహదారి వరకు రూ. 30 లక్షలతో త్వరలో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ, గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సచివాలయం వీధిలోనూ, ఎస్.వి విద్యామందిర్ బ్యాక్ సైడ్ రూ. 20 లక్షల నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణపనులను చేపడతామన్నారు. ఎంపీ మిథున్ రెడ్డి, ఎంఎల్‌ఏ శ్రీకాంత్, మున్సిపల్ పాలక వర్గం సహకారంతో 20 వ వార్డును అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానికులు గోవిందరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రాజారెడ్డి, అబ్బవరం రఘు, భాస్కర్ రెడ్డి, పొత్రెడ్డి నరేంద్ర రెడ్డి, అమరనాధ రెడ్డి,వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, అబ్బావరం నాగేశ్వర, వెంకట రమణ, రెడ్డెయ్య, రాజేంద్ర పాల్గొన్నారు.


గుంతలు పడ్డ సిమెంట్ రోడ్డు

పూర్తిగా దెబ్బతిన్న సిమెంట్ రోడ్డు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ పరిధిలోని పోకనాటి వీధి సిమెంట్ రోడ్డు పూర్తిగా దెబ్బతిని, రాళ్లు తేలిపోవడంతో ద్విచక్ర వాహనదారులు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు నడవడానికి సైతం వీలు లేకుండాపోయింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ఈ వీధి గుండా వెళ్లాలంటే భయం భయంగా వెళ్లాల్సింది. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిరంతరం ప్రజలు రాకపోకలు సాగించే పోకనాట వీధికి నూతన సిమెంట్ రోడ్డు వేయించాలని లేకుంటే కనీసం మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరారు. ఉన్నతాధికారులు తక్షణం స్పందించి సిమెంట్ రోడ్డును ఏర్పాటు చేసి వాహనదారులు, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.


నీటితో డ్రైవర్ ముఖాన్ని కడిగిస్తున్న పోలీసులు

ప్రమాదాల నివారణే ధ్యేయం

ప్రజాశక్తి- కలకడ

ప్రమాదాల నివారణ ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. సోమవారం రోడ్డు భద్రతా నియమాలలో భాగంగా సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహించి, వారు నిద్రకు గురై ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చల్లని నీటితో ముఖాలు శుభ్రం చేయించి పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. చిత్తూరు- కర్నూలు జాతీయ రహదారిపై స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట లారీలు, కార్లు, ఇతర వాహనాలను డ్రైవర్లు సుదూర ప్రాంతాల నుండి వస్తూ వేకువ జామున నిద్రలోకి జారుకుని ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు ఉన్నందున వారిని ఆపి నిద్ర నుండి మేల్కొల్పేందుకు ఇలాంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దీనివలన కొంతవరకు ప్రమాదాలను నియంత్రించేందుకు కొంత అవకాశముందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తాతయ్య, మునిరాజ, పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తోందని ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. పులివెందులలో మంగళవారం ఆయన నివాసం వద్దకు వచ్చిన నాయకులతో ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన వారికి పథకాలను వివరించాలని సూచించారు. ప్రజా సమస్యలను తెలుసుకొని సంబంధించిన అధికారులతో మాట్లాడి పరిష్కరించుకోవాలని సూచించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి గడపకు జగనన్న ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందాయన్నారు. అర్హులకు తప్పక సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. అనంతరం ఆయన అక్కడికి వచ్చిన ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేశారు. కార్యక్రమంలో బలరాంరెడ్డి, పుష్ప నాథ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు

అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు

వైసిపి యువనేత డాక్టర్ నవజ్యోతిరెడ్డి

ప్రజాశక్తి - ముద్దనూరు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి రాజకీయాలకు, పార్టీలకు, కులమతాలకు అతీ తంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని జమ్మలమడుగు నియోజకవర్గ వైసిపి యువనేత డాక్టర్ నవజ్యోతిరెడ్డి తెలిపారు. 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందారని జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి అండగా నిలిచారన్నారు. రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలను అందిస్తూ ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందన్నారు. తన పాదయాత్ర, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను జగన్ వంద శాతం అమలు చేశారన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తూ పారదర్శకంగా పరిపాలన సాగిస్తున్నారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి, మహిళలకు ప్రాధాన్యతనిచ్చి రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారన్నారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలకు వసతులు కల్పించారన్నారు. రోగులకు, విద్యార్థులకు కార్పొరేట్ విద్య, వైద్యం అందిస్తూ దేశంలో ఆదర్శంగా నిలిచారన్నారు. సిఎం జగన్, ఎంపి అవినాష్‌రెడ్డి సహాయ సహకారాలతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ.. ప్రజా సమస్యలపై దృష్టి సారించి పరిష్కరిస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని జగన్ నిరూపించారన్నారు.

400 మందికి వైద్య పరీక్షలు

గాలివీడు : మండలంలో గత నెల 30 నుంచి ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం ఆరవీడులో జరిగే కార్యక్రమంతో ముగియనుంది. ఇప్పటి వరకు గ్రామంలో 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. శస్త్రచికిత్స అవసరమైన రోగులను ఉన్నత ఆస్పత్రులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో నలుగురు డాక్టర్లు పాల్గొని వైద్యసేవలు అందించారు.

విలువిద్య అతి ప్రాచీన క్రీడ : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజా జీవితంలో భాగమైన విలువిద్య అతి ప్రాచీన క్రీడ అని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆటస్థలంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలను ఆయన పరిశీలించారు. అలాగే క్రీడాకారులు వెంట తెచ్చుకొన్న బాణాలు, విల్లు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ పూర్వ కాలంలో ఆదిమానవుడు ఆత్మ రక్షణతోపాటు ఆహార సం పాదన కోసం విలు విద్యను ఉపయోగించేవారని తెలిపారు. ఆధునిక మాన వుడు విలువిద్యను ఒక క్రీడగా, కళగా చూస్తున్నారని తెలిపారు. విలువిద్యకు భార తీయ సంస్కృతికి అవినాభావ సంబంధం ఉంద న్నారు. శ్రీరాముడు, శివుడు, అర్జునుడు, ద్రోణుడు, ఏకలవ్యుడు, కర్ణుడు గొప్ప విలు కాండ్రులని తెలిపారు. విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు విలువిద్య ద్వారా ఆంగ్లే యులను ముప్పుతిప్పలు పెట్టాడని వివరించారు. వేంపల్లెలో రాష్ట్రస్థాయిలో విలు విద్య క్రీడా పో టీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఒలింపిక్స్, ఆసియా క్రీడల్లో, కామన్వెల్త్ పోటీల్లో అవార్డులు పొందడం హర్షణీయమన్నారు. ఆంధ్రుడు అయినప్పటికీ చెరుకూరి సత్యనారాయణ విలువిద్య క్రీడాకారులను ప్రోత్స హించడం గర్వకారణమన్నారు. అర్జునుడు, శ్రీరా ముడు, అభినవ్ బింద్రా, దీపికా కుమారి, జ్యోతి సురేఖ వంటి వారిగా విలు విద్య క్రీడా కారులు తయారు కావాలని ఆయన ఆకాం క్షించారు. అనంతరం వోల్గా అర్చరీ అకాడమీ తరు పున తులసిరెడ్డిని సత్కరించారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ నాయకులు నరసింహారెడ్డి, అమ ర్నాథరెడ్డి, ఉత్తన్న, వినయ్, అర్చరీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెరుకూరి సత్య నారాయణ, సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.


విల్లును పరిశీలిస్తున్న తులసిరెడ్డి

సీనియర్ నాయకులను పరామర్శించిన 'చమర్తి'


సీనియర్ నాయకులను పరామర్శిస్తున్న జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట

పట్టణంలోని టిడిపి సీనియర్ నాయకులను మంగళవారం రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు జగన్‌మోహన్‌రాజు పరామర్శించారు. రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి సుధాకర్‌ను ఆయన స్వగృహం నందు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఇటీవల ప్రమాదానికి గురైన మరో సీనియర్ నాయకులు తరిగోపుల సంజీవ నాయుడును పరామర్శించి వీలైనంత త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ కార్యవర్గ కార్యదర్శి కొవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు, బండారు బాలయ్య, శ్రవణ వారి పల్లి సర్పంచ్ కోటయ్య నాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షులు సతీష రాజు, యువ నాయకులు పరుశురాం నాయుడు, నాగేంద్ర తులసి, విజయ్ కుమార్‌నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, హరికృష్ణ పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల్లో ..

మండలం పరిధిలోని వెంకట రాజంపేట గ్రామంలో కనకదుర్గ ఆలయంలో దేవీనవరాత్రి ఉత్సవాల్లో జగన్‌మోహన్‌రాజు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు చమర్తికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఉద్దండపు సుధాకర్, పోలా శేఖర్ రాయల్, చంద్ర, భార్గవ్, పోలా రమణ లు గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్ర మంలో శవనవారిపల్లె సర్పంచ్ కోటయ్య నాయుడు, బండారు బాలయ్య, మండల పార్టీ ఉపాధ్యక్షులు సతీష్‌రాజు, విజయ్‌కుమార్ నాయుడు, నాగేంద్ర, వెంకటేష్‌యాదవ్, సుబ్రహ్మణ్యంనాయుడు, సాంబ శివ నాయుడు, హరికృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా దసరా వేడుకలు


ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలో ప్రజలు, మహిళలు దసరా వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా చివరిరోజు మంగళవారం మండలంలోని అమ్మవారి ఆలయాల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి దసరా వేడుకలను జరుపుకున్నారు. పెద్దమాదిగపల్లిలోని మాతమ్మతల్లి ఆలయంలో తొమ్మిది రోజులపాటు మాత మ్మతల్లి వివిధ రూపాలలో దర్శనమిచ్చారు. మంగళవారం గ్రామ స్తులు, మహిళలు దీలు, బోనాలతో అమ్మవారికి తమ మొక్కుబడులను సమర్పించి, ప్రత్యేక పూజలను నిర్వహించారు. రైతులు, కూలీలు ఆలయం వద్ద ఆయుధ పూజలను నిర్వహించారు.భక్తులకు, పేదలకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు.


బుద్ధునికొండను సందర్శిస్తున్న బుద్ధ అంబేద్కర్ సమాజ్ ట్రస్ట్ సభ్యులు

శ్రీవాసవి లక్కీడ్రా విజేత నరేంద్ర

నందలూరు : దసరా మహోత్సవాల సందర్భంగా నాగిరెడ్డి పల్లె మేజర్ గ్రామపంచాయతీ లో వెలసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో నిర్వహించిన లక్కీ డ్రాలో మేస్త్రి నరేంద్ర విజేతగా నిలిచి మొదటి బహుమతి 225 గ్రాముల వెండి వస్తువులను గెలుచుకున్నాడు. ఈ డ్రా కార్యక్ర మానికి ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ద్వితీయ బహుమతి వాషింగ్ మిషన్‌ను ఎల్లంపల్లి సుధీష్ణ, తృతీయ బహుమతి రిఫ్రిజిరేటర్‌ను మస్తాన్, నాలుగో బహు మతి 25 గ్రాముల వెండిశంఖు చక్రాలు నిచ్చెన మెట్ల గురుప్రసాద్‌లు గెలుచుకున్నారు. 30 మందికి కన్సోలేషన్ బహుమతులను కూడా అందించారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాధవి, వైసిపి నాయ కులు హిమగిరినాథ్ యాదవ్, విజయుడు, ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకటకుమార్, చలపాటి నరసింహ శ్రేష్టి, కార్యదర్శి గెలివి నాగ సురేంద్రకుమార్, సంయుక్త కార్యదర్శులు యంబలూరు నరసింహ ప్రసాద్, మంచి కంటి నారాయణ, మహిళా మండలి అధ్యక్ష, ఉపాధ్యక్షులు గెలివి జయలక్ష్మి, చలపాటి మాధవి, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు. **నందలూరు:** మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి తనయుడు మేడాకృష్ణ తేజరెడ్డిలు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అన్నమాచార్య ఇంజనీరింగ్ కాలేజ్ చైర్మన్ చొప్పఎల్లారెడ్డి, అరిగెల సౌమిత్రి, గంపా సుధాకర్, గడికోట వెంకట సుబ్బారెడ్డి, గుండు మల్లికార్జున రెడ్డి, గుండు గోపాల్ రెడ్డి, అరిగే మనీ, అరిగే హరిబాబు, గుండు గోపాల్ రెడ్డి, ఆనాల మధు, సర్పంచ్ జంబు సూర్యనారాయణ, జిల్లా వర్ఫ్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, ఎజిపి షమీ ముల్లా ఖాన్ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** మదనపల్లి రూరల్ మండలం, అంకిశెట్టిపల్లి వద్దనున్న బుద్ధునికొండపై అశోక విజయదశమి పర్వదినాన్ని ధమ్మ విజయ మహోత్సవం పేరుతో ఘనంగా నిర్వహిం చారు. ఉదయం 8 గంటలకే బుద్ధ అంబేద్కర్ సమాజ్ ట్రస్ట్ సభ్యులు, బౌద్ధాభిమానులు పెద్దసంఖ్యలో బుద్ధునికొండకు చేరుకున్నారు. అక్కడున్న బోధి వృక్షమును, తథాగతుడు భగవాన్ బుద్ధుని విగ్రహాన్ని వివిధరకాల పుష్పములతో అలంక రించారు. దూపదీపాలతో అభిషేకించారు. అనంతరం భగవాన్ బుద్ధుని ప్రతిమలను పూలతో అలంకరించిన కలసములను తలపై ఎత్తుకొని, త్రిశరణాలను పటిస్తూ బోధి వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా బుద్ధ అంబేద్కర్ సమాజ్ ఫౌండర్ ట్రస్టీ ఉపాసక పిటిఎం శివప్రసాద్ మాట్లాడుతూ ఎన్నో యుద్ధాలను జయించి,అఖండ భారతన్ని పరిపాలించిన గొప్ప చక్రవర్తి అశోకుడు అని చెప్పారు. కళింగ యుద్ధంలో విజయం సాధించి ఏడాది పూర్తయిన సందర్భంగా పదిరోజుల పాటు ఘనంగా ఉత్సవాలు నిర్వస్తున్నట్లు సామ్రాట్ అశోకుడు ప్రకటించడం జరిగిందని, అఖండ భారతదేశమంతటా ప్రజలు ఈ పదిరోజుల పండుగను ఘనంగా జరుపుకు న్నారని చెప్పారు. **కలికిరి:** మండలంలో విజయదశమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. శరన్నవరాత్రులను పురస్కరించుకుని మండలంలోని అన్ని ప్రధాన ఆలయాలైన గ్రామ దేవత ఎల్లమ్మ, షిరిడి సాయి బాబా, శివాలయం గొట్టపాలెం పంచాయతీ పూలకొండలో వెలసిన శ్రీ భ్రమరాంబిక మల్లార్జునస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను భక్తులు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమాలు, తీర్థప్రసాదాలు భక్తులకు పంచిపెట్టి అమ్మవారి కృపకు పాత్రుడయ్యారు. **తంబళ్లపల్లి:** మల్లయ్య కొండ భ్రమ రాంబిక మల్లికార్జున స్వామి ఆలయానికి సమీపంలో వెలసిన గౌరీ దేవి ఆలయంలో అమ్మవారికి పూజారి శేఖర్ మహిషాసు మర్దినిగా గౌరీ దేవిని అలంకరించి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించాకరు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. మహిళలు భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు.


నందలూరు: విజేతకు బహుమతిని అందిస్తున్న ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కారమయ్యేనా..!

ప్రజాశక్తి - చాపాడు

పనిభారం, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం, కనీస వేతనం రూ.26వేలు వంటి ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి ఆశావర్కర్లు కొంతకాలంగా పోరాటాలు సాగిస్తున్నారు. దీనిపై ప్రభుత్వంలో ఎలాంటి స్పందన లేదని పలువురు పేర్కొంటున్నారు. వారు చేస్తున్న పోరాటాన్ని అణగదొక్కేందుకు ప్రయత్నాలు చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆశా కార్యకర్తలు నిరసనలు, కలక్టరేట్ ముట్టడి, ప్రజాప్రతినిధులను కలిసి వినతి పత్రాలను అందించడం వంటి నిరంతర నిరసనలు కొనసాగిస్తున్నారు. కరోనా సమయంలో ఫ్రంట్‌లైన్‌లో పనిచేసిన ఆశా కార్యకర్తలకు నేడు నెలల తరబడి జీతాలు ఇవ్వడం లేదు. కనీస వేతనం అమలు చేయడం లేదు. గౌరవ వేతనం ఇచ్చి ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తోందనే విమర్శలు లేక పోలేదు. సంవత్సరం పొడవునా పని చేయాల్సిన పరిస్థితి ఉంది. ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని కోరుతున్నారు. ఆశా వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆశా వర్కర్లకు సంబంధం లేని పనులు అప్పగిస్తున్నారని, నాణ్యమైన ఫోన్లు ఇవ్వలేదని వాపోతున్నారు. ప్రస్తుతం జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆశా కార్యకర్తలు హాజరౌతున్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బందికి సహాయకులుగా వీరికి పని ఒత్తిడి ఎక్కువైంది. వేతనాలు సరిగా అందక సతమతం అవుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. తమ డిమాండ్లు, సమస్యలను మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డికి ఆశా కార్యకర్తలు వివరించారు. తమ న్యాయమైన సమస్యలు, డిమాండ్లను నెరవేర్చాలని వారు కోరారు.


సమస్యలను ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి వివరిస్తున్న ఆశావర్కర్లు (ఫైల్‌ఫొటో)

వేతనాలు పెంచి ఇవ్వాలి..



ఆశా వర్కర్లకు అన్ని రకాల ఆరోగ్య సంబంధమైన పనులను అప్పగిస్తున్నారు. ప్రతిరోజు ఏదోక సర్వే పేరుతో పని అప్పగిస్తున్నారు. ప్రస్తుతం 20 రోజులుగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొంటున్నాం. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు పెంచి ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- లక్ష్మి, ఆశా కార్యకర్త, చాపాడు

సంక్షేమ పథకాలు అమలు చేయాలి



ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలయ్యేలా ప్రభుత్వం చూడాలి. నిత్యం ప్రజా ఆరోగ్య సమస్యలపై సహకారం అందిస్తున్న ఆశా కార్యకర్తలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా వేతనాలు పెంచి ఇవ్వాలి. కుటుంబ పోషణ ప్రస్తుతం అందుతున్న వేతనాలతో కష్టంగా ఉంది.

- నరసమ్మ, ఆశా కార్యకర్త, చాపాడు


కళాశాలను ప్రారంభిస్తున్న రాంప్రాసాద్‌రెడ్డి, రాజకీయ ప్రముఖులు

డిగ్రీ కళాశాల ప్రారంభంలో రాజకీయ ప్రముఖులు

ప్రజాశక్తి-వీరబల్లి

అత్యాధునిక హంగులతో గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు వీరబల్లి మండలంలో అన్ని రకాల సౌకర్యాలతో ఎస్‌డికెఆర్ డిగ్రీ కళాశాల నిర్మించడం అభినందించదగ్గ విషియమని రాజకీయ పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. కళాశాల నూతన భవన ప్రారంభోత్సవంలో పాల్గొని యాజ మాన్యానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని వాటిని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు మంచి నాణ్యమైన విద్యను అందిచాలని కళాశాల డైరెక్టర్ రవిశేఖర్ రెడ్డి, సురేంద్రరెడ్డిని కోరారు. అనంతరం రాజకీయ ప్రముఖులను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు రమేష్ కుమార్‌రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, సుగవాసి ప్రసాద్ బాబు, సాయి లోకేష్, వైసిపి సీనియర్ నాయకులు గాలివీటి విజయ భాస్కర్‌రెడ్డి, లివిన్ డయాగ్నస్టిక్ ఎండి వివేక్ రెడ్డి, ఎంపిపి రాజేంద్రనాథ్ రెడ్డి, మదన్ రెడ్డి, జడ్‌పిటిసి శివరాం, తాటిగుట్ల శ్రీధర్‌రెడ్డి, విఆర్ స్కూల్ అధినేత వెంకట్రామిరెడ్డి, అర్చన మదన్‌మోహన్‌రెడ్డి, ఎస్‌డికెఆర్ కళాశాల ప్రిన్సి పల్ ధర్మారెడ్డి, కుళాయిరెడ్డి, మధురెడ్డి, బాబురెడ్డి, పద్మనాభరెడ్డిలు పాల్గొన్నారు.

లేఅవుట్‌లు వేసినవారిపై చర్యలేవి?

ప్రజాశక్తి-గాలివీడు

అక్రమ లేఅవుట్లు వేసిన వారికి వారంలో నోటీలు ఇస్తామని మండల సమావేశంలో పేర్కొని నేటికి మూడు వారాలు అవుతున్న ఆ ప్రస్తావనే లేదని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో మండల సమావేశంలో సెప్టెంబర్ 7న జరిగిన మండల సమావేశంలో అక్రమ లేవోట్లపైన వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి రెవెన్యూ అధికారులపై ధ్వజం మెత్తారని అన్నారు. ఎంపీడీవో శేఖర్ నాయక్ స్పందించి వారంలోపు ఆయా గ్రామాలలో గోరాన్ చెరువు గాలివీడు గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా నోటీసులు అందిస్తామని చెప్పినా ఇంత వరకు నోటీసుల ప్రస్తావనే రాలేదని చెబుతున్నారు. మండల సమావేశంలో జరిగిన తీర్మానాలు కూడా ఇలానే ఉంటాయని ప్రజల్లో చర్చించుకుంటున్నారు.

సంప్రదాయాలను కొనసాగించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పురాతన సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగింజల విజయలక్ష్మి, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగింజల చంద్రమౌళి సూచించారు. పట్టణంలోని చౌడేశ్వరి అమ్మవారి జ్యోతి ఉత్సవాల్లో మంగళవారం వారు మాట్లాడుతూ తొగటవీర క్షత్రియులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే చౌడేశ్వరి అమ్మవారి జ్యోతి ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషకరమన్నారు. ఈ జ్యోతి ఉత్సవాలకు ఒక ప్రత్యేకస్థానం ఉందన్నారు. అత్యంత భక్తిశ్రద్ధలతో జ్యోతి ఉత్సవాలు నిర్వహించామన్నారు. చౌడేశ్వరి అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన చౌడేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షులు గంజికుంట తిరుమల దాస్, ఆలయ కమిటీ సభ్యులను వారు అభినందించారు.

రెడ్లకు ప్రత్యేక స్థానం ఉంది : ఎమ్మెల్యే

జమ్మలమడుగు: తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల్లో కూడా రెడ్లకు ప్రత్యేకస్థానం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో మంగళవారం రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రెడ్ల ఘన చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెడ్ల ఘన చరిత్రను పుస్తక రూపంలో ఆవిష్కరించడం శుభపరిణామన్నారు. ఆర్థికంగా వెనుక బడిన రెడ్ల సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభు త్వం తోడ్పాటునిస్తుందన్నారు. కార్యక్రమాన్ని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఒంటెద్దు రామలింగారెడ్డి(బాబు) ఆధ్వర్యంలో నిర్వహించగా, రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శి ఆలమూరు జగన్మోహన్‌రెడ్డి, లింగారెడ్డి, హరినాథ్‌రెడ్డి, ప్రభంజన్‌రెడ్డి(భాను) పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో మంగళవారం అయిదు మంది లబ్ధిదారులకు రూ.4,30,000సిఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వర్తించని వారికి సిఎం సహాయ నిధి ఎంతో ఉపయోగమన్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట


గాయపడిన జస్వంత్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రగాయపడిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పిటిఎం మండలం బూర్లపల్లికి చెందిన అనిల్(20) వేములేటికోటకు చెందిన జస్వంత్ వీరిరువురూ పల్సర్ ద్విచక్ర వాహనంలో బి.కొత్తకోట నుంచి పిటిఎం వైపు వెళుతూ మార్గ మధ్యంలో కట్టెల సమీపంలో పిటిఎం వైపు నుంచి బి.కొత్తకోట వైపు వస్తున్న కారుకు ఢీకొట్టారని తెలిపారు. ఈ ప్రమాదంలో అనిల్ తలకు బలమైన రక్తగాయాలు కాగా, జస్వంత్‌కు స్వల్ప గాయాలయ్యాయని చెప్పారు. వెంటనే వీరిద్దరిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ ద్వారా మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.


దగ్ధమైన పశుగ్రాసాన్ని చూపుతున్న రైతు

గడ్డివామి దగ్ధం : రైతుకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

గడ్డివామి దగ్ధమై రైతుకు తీవ్రనష్టం వాటిల్లిన సంఘటన నిమ్మనపల్లి మండలంలో జరిగింది. నిమ్మనపల్లి పంచాయతీ పెద్దమాదిగపల్లెకు చెందిన కొమ్ము వెంకటేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. దీనితోపాటు వెంకటేష్ నిమ్మనపల్లి సచివాలయంలో వాలంటీరు గాను పనిచేస్తున్నారు. పెద్దమాదిగ పల్లిలోని తన ఇంటికి ఎదురుగా పశువుల కోసమై వరి గడ్డిని వామినిగా వేసి ఉంచారు. సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివామికి నిప్పు అంటించడంతో మంటలు చెలరేగాయి, ఇది గమనించిన స్థానికులు మంటలను అదుపులోకి తేవడానికి తీవ్రంగా శ్రమించగా, అప్పటికే గడ్డివాము కాలిపోయినట్లు చెప్పారు. ఐదు ట్రాక్టర్ల లోడు కలిగిన గడ్డివామి కాలిపోవడంతో రైతు కుటుంబానికి తీవ్ర నష్టం వాటిల్లినట్లు చెప్పారు. ఈ సంఘటనపై తహశీల్దార్ మంజులకు బాధితుడు సమాచారం అందించగా, సంఘటన స్థలానికి రెవెన్యూ అధికారులను పంపించి విచారణను చేపట్టారు. రైతును ఆదుకుంటామని తెలిపారు.